చాపరాయికి పర్యాటకుల తాకిడి

చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి దుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. చాపరాయి జలపాతం ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంతో జలకాలాడుతూ, అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా జలపాతం గార్డెన్ వద్ద ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. వర్షాకాలంలోనూ పర్యాటకులు తాకిడి, సందడి అధికంగానే కనిపిస్తోంది. ఆదివాసీ గిరిజన సంప్రదాయ వస్త్ర వేషధారణలో థింసా నృత్యాలు చేస్తూ, స్థానిక గిరిజనులతో మమేకమై పర్యాటకులు ఆనందంగా గడిపారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు

- వర్షాలతో జారుడు బురద, గుంతలమయం
- శ్రమదానం చేసి బాగుచేసుకున్న గిరిజనం

ప్రజాశక్తి-హుకుంపేట: ఇటీవల వర్షాలకు బురద, గోతులమయంగా మారిన రహదారిని గిరిజనులు స్వచ్ఛందంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి బాగుచేసుకున్నారు. అధ్వానరహదారితో అనునిత్యం తాము అవస్థలు పడుతున్నా పట్టించుకోని అధికారులు, నేతలు తీరుపై నిరసన వ్యక్తం చేస్తూనే, శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా తమ రాకపోకల కష్టాలపై అధికారులు స్పందించి, శాశ్వతరోడ్డు నిర్మాణం చేయాలని వేడుకుంటున్నారు.

మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట నుండి గుర్రాలతోట గ్రామం వరకు మట్టిరోడ్డు, రోజూ కురుస్తున్న వర్షాల కారణంగా బురద, రహదారి గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోజూ ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండటంతో, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అయితే ఎటువంటి స్పందన లేకపోవడంతో గుర్రాలతోట, తోకదుగ్గం, బాసలబంద గ్రామాల గిరిజనులుఆదివారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. కొంతమంది గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించారు. బీజ్జపల్లి గ్రామానికి చెందిన వంతల భీమరాజు రూ.500, అమూరు గ్రామానికి చెందిన కొర్ర చిట్టిబాబు రూ.500 ఆర్థికసాయం అందించి గ్రామస్థులను ప్రోత్సహించారు. దీంతో బురదరోడ్డులోని గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించి, మట్టితో చదును చేసే పనులు చేపట్టారు. సమిష్టిగా కృషి చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని నిరూపించి, ఆదర్శంగా నిలిచారు. అయితే గిరిజనులు చేపట్టిని పనులు తాత్కాలికం కావడంతో మళ్లీ వర్షం కురిస్తే, వేసిన మట్టి కరిగిపోయి, మళ్లీ పూర్వపు పరిస్థితులు వస్తాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆయా గ్రామాలకు పక్కా రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బూత్ ఇంచార్జి పి.చిరంజీవి, బూత్ కోకన్వీనర్ కె.కామరాజు, పీసా కార్యదర్శులు ఎం.చిట్టిబాబు, కె.పెంటన్న, వార్డు సభ్యులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకుంటున్న గిరిజనులు

మరమ్మతులకు ముందు బురద, నీరు నిండిన గోతులతో రోడ్డు

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చింతపల్లి : సిఐటియు మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సిఐటియు విస్తృత స్థాయి సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్‌గా, చిరంజీవి, కో-కన్వీనర్‌గా పెంటమ్మ, మరో 23 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మండలంలోని 16 రంగాల నుంచి ఈ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల కాలంలో మండలంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, వెంకటి, ఇందు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

సిఐటియు మండల కన్వీనర్ చిరంజీవి, కోకన్వీనర్ పెంటమ్మ

ఎరువులకు పడిగాపులు

ఎరువుల కోసం క్యూలైన్లలో వేచియున్న గిరిజన రైతులు

యూరియా దక్కించుకున్న రైతులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఎరువుల కోసం చింతపల్లిలో గిరిజన రైతులు ఆదివారం భారీగా పోటెత్తారు. ఉదయం చింతపల్లికి యూరియా ఎరువు లోడు రాగానే స్థానిక డీలర్ వద్ద రైతులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. రైతులు ఆధార్ నంబర్లతో నమోదు చేసుకుని యూరియా ఎరువును తీసుకున్నారు.

అందిన యూరియా తమ అవసరాలకు సరిపోవడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎరువులను ఎక్కువ మొత్తంలో కేటాయించాలని డిమాండ్ చేశారు.

భారీ వర్షానికి రోడ్డుపై పారుతున్న నీరు

అరకులోయలో భారీ వర్షం

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక ప్రాంతమైన అరకులోయ పరిసరాల్లో దివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో స్థానికులు పర్యాటకులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఇంతలోనే భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాహన చోదకులు స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. అయితే గిరిజన రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ, అనంతగిరి, విశాఖ ప్రధాన రహదారి ఘాట్ రోడ్లు కుండ పోత వర్షంతో భారీగా నీరు నిలవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు వర్షంతో నానా అవస్థలు పడక తప్పలేదు. చ్చారు. ఇక్కడ పడితే అక్కడ వర్షపు నీరు నిండి ప్రయాణికులు వానచోదకులు ఇబ్బందులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భిన్న వాతావరణం

ఉదయాన్నే దట్టంగా కురిసిన పొగమంచు

ప్రజాశక్తి-హుకుంపేట: ఏజెన్సీలో ప్రస్తుత వర్షాల సీజన్‌లో వాతావరణ పరిస్థితులు క్షణానికో రకంగా ఉంటూ, ప్రజలకు ఆనందాన్ని, అదే సమయంలో ఇబ్బందులను గురిచేస్తున్నాయి. ఆదివారం మండల కేంద్రంలో ఒకే రోజులో మూడు కాలాల వాతావరణం పరిస్థితులు సాక్షాత్కరించాయి., వేకువజామున ఐదు గంటల నుంచి ఆరు గంటలన్నర వరకు ప్రాంతమంతా మంచుతో కప్పి, శీతాకాలం నాటి పరిస్థితులు కనిపించగా, తర్వాత ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు భానుడు భగభగలాడుతూ వేసవిని తలపించాడు, తర్వాత వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మబ్బులతో నిండి వర్షం కురిసింది. ఒకేరోజు భిన్నమైన మూడు కాలాల వాతావరణ పరిస్థితులతో స్థానికులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఏజెన్సీలో ఇది సాదారణమేనని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

మధ్యాహ్నం ఎండతో కూడిన నిర్మల ఆకాశం

సాయంత్రం కురుస్తున్న వర్షం

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఐక్యపోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. ఆదివారం రాజవొమ్మంగిలో సిఐటియు మండల సమీక్ష సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు అధ్యక్షతన నిర్వహించారు. లోతారామారావు మాట్లాడుతూ స్కీం వర్కర్ లు అంగన్వాడి,ఆశ,మిడ్ డే మీల్స్ వర్కర్ల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,భవన నిర్మాణం,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, రవాణా రంగ కార్మికులు,ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇతర రంగాల కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల పక్షాన నిలబడాల్సిన కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి బడా కార్పొరేటర్లకు దాసోహం అయ్యిందని విమర్శించారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్తులో జరిగే ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడి,ఆశ,మిడ్డే మీల్స్,ప్రజాసంఘాల నాయకులు కె వెంకటలక్ష్మి,టి శ్రీను, సత్యవతి,వరలక్ష్మి,రత్న కుమారి,తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోతా రామారావు

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

200 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందజి మహారాజ్ తెలిపారు. రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్‌చార్జి స్వామి లోకమయనందజీ మహారాజ్ వైద్యశిబిరాన్ని పరిశీలించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 మందికి పరీక్షలు చేశామని స్వామీజీ తెలిపారు. 55 మందికి రక్తపరీక్షలు, 10 మందికి థైరాయిడ్ పరీక్షలు, 16 మందికి ఫిజియోథెరపి, 7గురికి ఇసిజిలు చేసినట్లు స్వామీజి తెలిపారు. రామకృష్ణమిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవా లని స్వామీజీ చెప్పారు. వైద్యశిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొని క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లు దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు. రోగులు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రణభేరి బైక్‌జాతాను జయప్రదం చేయండి

చింతూరు-ప్రజాశక్తి: యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న రణభేరి బైక్‌జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ అధ్యక్షులు భీమయ్య తెలిపారు. యుటిఎఫ్ చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్‌జాత వాల్‌పోస్టర్‌ను ఆదివారం చింతూరు యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సమావేశానికి యుటిఎఫ్ అధ్యక్షులు భీమయ్య అధ్యక్షత వహించారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పండా కృష్ణయ్య మాట్లాడుతూ రణభేరి బైక్ జాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి ప్రారంభమై విలీన మండలాల్లో కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు గురించి చర్చిస్తామన్నారు. యుటిఎఫ్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ముత్తయ్య, మండల కమిటీ సభ్యులు తులసమ్మ, రత్నకుమారి పాల్గొన్నారు.

పూటకో మాటతో గిరిజనులకు వెన్నుపోటు

- పాయం వెంకయ్య తీరుపై తెల్లం తమ్మయ్య అసహనం

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని శ్రీమార్త శ్రీరాంమూర్తి భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. గిరిజన సంఘం మండల అధ్యక్షులు తెల్లం తమ్మయ్య మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘం చేస్తున్న భూ పోరాటం స్పష్టంగా ఉంద ని పోలవరం నష్టపరిహారం తీసుకున్న గిరిజనేతర భూస్వాములు గ్రామం నుండి వేరే వేరే ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అధీనంలో ఉన్న భూమి గిరిజనేతరులకు అప్పగించడం 1/70 చట్టం ప్రకారం చట్టరీత్యానేరం అని బిజెపి నాయకులు పాయం వెంకయ్యకు తెలియదా అని ప్రశ్నించారు. ఒకప్పుడు సిపిఎంలో ఉండి చట్టాలు అమలు గురించి చెప్పిన మీకు ఇప్పుడు పార్టీలు మార్చిన తర్వాత గిరిజనులు వ్యతిరేకమయ్యారా అని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని ఒక్కోసారి, మరోసారి కేంద్రం న్యాయం చేస్తుందని ఏ విధంగా చెప్తారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి బొగ్గ రామారావు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మడకం నాగమణి, బొగ్గ సుబ్బయ్య, పోడియం రామారావు,గుండం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘ మండల అధ్యక్షులు తెల్లం తమ్మయ్య

పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా కొలుపులు పండగ

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి గ్రామంలో పోడు గిరిజనులు రాజులస్వామివారిని కులదైవాలుగా కొలుస్తుండడం ఆనవాయితీ. ప్రతి ఏడాది సెప్టెంబర్ నెల రెండో వారంలో ఈ పండగ నిర్వహిస్తారు. ఆదివారం పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు కులదైవాలైన రాజుల స్వామివారి వెండి ఆభరణాలు, గొడుగులను పూజారి సారపాండురాజు ఇంటి వద్ద నుంచి రేఖపల్లి శివారులో కొలుపులు చేసే గద్దెలు రాజుల స్వామివారి నగిరి వద్దకు తీసుకువెళ్లి అక్కడ పూజారులు వెండి ఆభరణాలను శుద్ధిచేసి చేసి బూరుగుచెట్టు వద్ద అలంకరించి పూజలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తారు. రాజుల స్వామివారి పూజారి సారా పాండురాజు రేకపల్లి గ్రామ కులపెద్ద చిక్కాల బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒక్కసారి రాజుల స్వామివారి కొలుపులు వైభవంగా చేస్తారని వేలసంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలిపారు.

విత్తనాలు అందిస్తున్న జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్

రాజ్‌మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు: జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ ఆదివారం పలువురు రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. మారుమూల ప్రాంత రైతులు గంజాయి సాగును విడనాడి, ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గు చూపాలని కోరారు. మండల కేంద్రంలోని చీడిపాలెం రైతుసేవా కేంద్రంలో 90 శాతం రాయితీతో రాజ్‌మా విత్తనాలను వంపిణీ చేశారు. ప్రతి రైతుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలానికి సంబంధించి 180 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బూదరాళ్ల పంచాయతీ గిరిజనులందరూ రైతుసేవా కేంద్రంలో విత్తనాలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, సిబ్బంది అలాగే పలువురు రైతులు, టిడిపి నేతలు కూనిశెట్టి చందర్రావు బూద రాళ్ల వార్డు మెంబర్ సాగిన సంజీవ్, వంతమర్రి నారాయణ, నేత కొర్ర త్రినాధ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టి సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు.తిరుపతి రాహుల్ కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం జాతీయ పార్లమెంటరీ శాసనసభ కమిటీల మహిళా సాధికారత మొదటి సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రెండు రోజుల పాటూ నిర్వహించనున్న సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య గిరిజన మహిళలకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారిత కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కి తోడ్పాటు అందించే విధంగా ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ మహిళల సాధికారిత కోసం కూడా ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి, హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మహిళా ఎమ్మెల్యేలు తోయక జగదేశ్వరి, భూమా అఖిలప్రియ పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే శిరీషాదేవి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - చింతూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ముల్లిశేఖర్ తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హిందీ జాతీయభాష అయినందున అందరూ నేర్చుకోవాలన్నారు. హిందీ విభాగధిపతి కె.శైలజ మాట్లాడుతూ హిందీ భాష చాలా తేలికగా నేర్చుకోవచ్చునన్నారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు జి.వెంకటరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి తదితరులు

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ డొంకినవలస నుంచి చిలకలపుట్టు గ్రామానికి కొత్త రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను స్థానిక వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం వార్డు సభ్యులు మజ్జి రాజారావు, వలసనైని వంశీ ప్రజలతో కలిసి ప్రారంభించారు.ఈ రహదారి పనులను రూ.5 లక్షల మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్నారు.ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ ఈ రోడ్డు పనులు పూర్తయితే, గిరిజనుల కాలినడక కష్టాలకు విముక్తి కలుగుతుందన్నారు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు, పండించిన కాఫీ, మిరియాలు, రాజిమ వంటి పంటలను మార్కెటింగ్‌కు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి రవాణాకు వీలుకలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు తామర్ల సుబ్బారావు, డొంకినవలస స్కూల్ కమిటీ చైర్మన్ డుంబేరి సురేష్, గ్రామపెద్దలు డుంబేరి మల్లన్న, గెడ్డవలస మాజీ వార్డు సభ్యుడు జంగిడి వెంకటరావు, మజ్జి అప్పారావు, డుంబేరి మల్లు దొర, మజ్జి రాంప్రసాద్, సీదరి నాగేశ్వరరావు, మజ్జి కొండన్న, మజ్జి అప్పన్న, మజ్జి శంకరరావు, నందోలి అప్పారావు, సూడిపల్లి అప్పన్న, సూడిపల్లి సింహాద్రినాయుడు, డుంబేరి మత్స్యరాజు పాల్గొన్నారు

శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత

ప్రజాశక్తి- నాతవరం : నాతవరం ఎస్ఐగా వై.తారకేశ్వరరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి్రదతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈస ందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందితోపాటు పలువురు స్థానిక నేతలు కొత్త ఎస్ఐ తారకేశ్వరరావుకు ఆయన తెలిపారు. అనంతరం పలువురు ఎస్సై కు శుభాకాంక్షలు తెలిపారు

'గాడిచర్ల'కు ఘననివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర గ్రంథాలయోద్యమ పితామహుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల. హరిసర్వోత్తమరావు జయంతిని ఆదివారం స్థానిక శాఖాగ్రంథాలయంలోఘనంగా నిర్వహించారు. గాడిచర్ల చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో పాఠకులు రామచంద్రరావు, అప్పలస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయోద్యమానికి గాడిచర్ల చేసిన సేవలను కావ్య వివరించారు. స్వాతంత్ర సమరంలో గ్రంథాలయాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి, ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమం పట్ల కార్యోన్ముఖులను చేయడానికి హరిసర్వోత్తమరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతు స్వాతంత్ర్య ఉద్యమంలో దక్షిణ భారత దేశంలోనే తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల సర్వోత్తమరావు అని, ఎడిటర్ అన్న పదానికి సంపాదకుడు అని నిర్వచనం చెప్పిన మహనీయుడని కొనియాడారు. హిందీ భాషాదినోత్సవాన్ని కూడా నిర్వహించారు.

రాజయ్యపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి నక్కపల్లి : మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో పిక్కి కోటి (కన్నాలు) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ పవన్ సాయి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కాంచన, డాక్టర ఇతిస్ అక్షయరాజ్, డాక్టర్ ఎస్ తోసిఫ్, డాక్టర్ సుధా మాధురి, డాక్టర్ హేమంత్ కుమార్, ఐమా నేత్ర సోషల్ వర్కర్ గండుపల్లి డిల్లేశ్వరి సహాయ సహకారాలతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పవన్ సాయి హాస్పిటల్ సిఇఒ రామారావు, ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ ప్రారంభించారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మధుమేహం, అధికరక్తపోటు, దంత సమస్యలు, కీళ్ల నొప్పులు, గుండె పరీక్ష, తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య, నానాజీ, సింహాద్రి రాజయ్యపేట టిడిపి నాయకులు పిక్కి రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

అమలగుడ గిరిజనుల ఆందోళన

ఆందోళన చేస్తున్న అమలగుడ గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వున్న అమలగుడ గ్రామానికి ప్రభుత్వం తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు ఆదివారం ఆందోళన చేపట్టారు. కనీస రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతునామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని కూటమి ప్రభుత్వ నేతలు ప్రకటించడంతోపాటు ఏజెన్సీలోని పలు రోడ్లుకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నిధుల మంజూరు, శంకుస్థాపనలు చేస్తున్న నేపథ్యంలో తమ గ్రామంపై కూడా దృష్టిసారించాలని అమలగుడ గిరిజనులు వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొర్రా రామసందర్, రామదాసు, తదితరులు మాట్లాడుతూ మండల కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, తమ గ్రామానికి రోడ్డు, ఇతర సౌకర్యాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి సమీపంలో తాడిగూడ జలపాతం ఉందని, అక్కడ వరకు రోడ్డు సౌకర్యం కల్పించిన ప్రభుత్వ యంత్రాంగం తమ గ్రామాన్ని మాత్రం నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదని వాపోయారు. మూడేళ్ల క్రితం తాడిగూడ మెయిన్ రోడ్డు నుండి అర కిలోమీటర్ వరకు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించి వదిలేశారని ఆరోపించారు. దీంతో నిత్యవసరాలతోపాటు అత్యవసరానికి నానా అగచాట్లు పడతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గర్భిణులు, ఆరోగ్యం విషమంగా ఉన్న రోగుల పాలిట రోడ్డు లేమి శాపంగా ఉందని, . ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అమలగుడకు శాశ్వత రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా మట్టి మాఫియా

●ఏలేరు కాలువ గట్లను గుల్ల చేస్తున్న అక్రమార్కులు

●రేయింబవళ్లు దందా.. చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం/ కోటవురట్ల : ఏలేరు కాలువ మట్టి అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. రేయింబవళ్లు తేడా లేకుండా, కాలువ గట్టు మట్టిని లారీలు, ఇతర వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ, మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్ల భవిష్యత్‌లో విశాఖకు తాగునీరు అందించే ఈ కాలువకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. అధికారపార్టీ నేతలు ఈ దందాలో భాగస్వాములు కావడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

నర్సీపట్నం కోటవురట్ల మండలాల మండలాల మీదుగా విశాఖ నగరానికి తాగునీరు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నీటిని గోదావరి నుంచి తరలించేందుకు మూడున్నర దశాబ్దాల క్రితం ఏలేరు కాలువ నిర్మించారు. పల్లె,పట్టణాలని తేడాలేకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారం, లేఅవుట్లు విరివిగా వెలుస్తుండడంతో, వాటిని చదును చేసేందుకు మట్టి అవసరం కావడంతో ఏలేరు కాలువ గట్టు మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేసి తరలించుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు. పెద్దఎత్తున మట్టి తవ్వకాలతో అక్రమార్కులు లక్షలు ఆర్జిస్తూ, ఏలేరు కాలువను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

చెర్లోపాలెం, పాములవాక, వేములపూడి, అన్నవరం, పరిసర ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న ఏలూరు కాలువ సమీపంలో మట్టిని రాత్రి పగలు అని తేడా లేకుండా తరలించుకు పోతున్నారు, నర్సీపట్నం, కోటవురట్ల రెండు మండలాల అధికారపార్టీ నాయకులు అండదండతో మట్టి అక్రమ రవాణా సాగుతోందని ఆరోపణలున్నాయి. ఏలేరు కాలువ మట్టిని అత్యధికంగా నర్సీపట్నం ప్రాంతంలోని ప్రైవేటు లేఅవుట్లుకు తరలించుకుపోతున్నారు, ఒక్కో లారీ మట్టికి దాదాపు రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యవహారంపై సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమీప ప్రాంత రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,

భారీ వాహనాలతో పాడౌతున్న రోడ్లు

ఏలేరు కాలువ మట్టిని భారీ వాహనాలతో తరలించుకుపోతున్న క్రమంలో ఇక్కడి రోడ్లు పూర్తిగా శిథిలమై పోతున్నాయని ఆయా ప్రాంత సర్పంచులు, నాయకులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, పలు మార్లు మట్టి అక్రమ రవాణాను అడ్డుకొని నిలువరించే ప్రయత్నం చేసినా, మట్టిమాఫియా దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, దాడికి దిగే ప్రయత్నం చేయడంతో మిన్నకుండక తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. మట్టి లారీలను అడ్డుకోవడానికి మీరేవరంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతోపాటు, అధికారులకు ఫిర్యాదు చేసుకోండి, చేతనైంది చేసుకోండంటూ ఎదురుదాడి చేస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అవసరమైతే ఫైన్ చెల్లిస్తామే తప్ప, మట్టి తరలింపును ఆపేది లేదంటూ ప్రజలకు సవాల్ విసురుతున్నారని అంటున్నారు. ఏలేరు కాలువ నిర్వహణకు సంబంధిత నీటిపారుదలశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసులు, ఇతర విభాగాల అధికారులెవరూ ఈ మట్టిదందాను పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ఆవేదన చెందుతుండగా, లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నామని అక్రమార్కులు బహిరంగంగా చెబుతుండడంతో విస్తుపోతున్నారు. మట్టి త్రవ్వకాలు చేపడుతున్న ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ లైన్లు కూడా ఉండడంతో ఎపుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి, మట్టిమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలతోపాటు రైతులు కోరుతున్నారు.

దాడి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

- ఎం.కృష్ణాపురంలో నిరసన

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో యాదవ కుటుంబానికి చెందిన కోళ్ల వరహాల నాయుడుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. అనంతరం గంటా శ్రీరామ్ మాట్లాడుతూ, ఎం.కృష్ణాపురానికి చెందిన వరహాలనాయుడుపై ఆదే గ్రామానికి చెందిన మాడుగుల ఎమ్మెల్యే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నీటిపల్లి రాము, అతని అన్నయ్య సర్వేయర్ నీటిపల్లి నాయుడు, వారి తండ్రి నీటిపిల్లి రాజారావు మూకుమ్మడిగా దాడి చేసి, నానా దుర్భాషలాడుతూ చితక్కొట్టడం దారుణమన్నారు. బాధితుడు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. తన వరిపొలం గట్టును ఎందుకు తవ్వేస్తున్నారని ప్రశ్నించినందుకు వరహాలనాయుడుపై దౌర్జన్యంగా దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని శ్రీరాం డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం చేయకుంటే ఈనెల 18న మాడుగుల తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, కేసులు నీరుగార్చాలని చూసినా, నిందితులపై తగు చర్యలు చేపట్టకున్నా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.కార్యక్రమంలో కోళ్ల రాజుబాబు, ముప్పల గణేష్, మొల్లి అప్పారావు, మొల్లి గణేష్, గ్రామపెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని అయ్యన్నపాలెం జంక్షన్‌లో స్థానిక ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మోటారు సైకిళ్లను, కార్లను ఆపించి డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, హెల్మెట్, సీట్‌బెల్ట్, ఇతర ట్రాఫిక్ నిబంధనపై సమగ్ర పరిశీలన జరిపారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు చేశారు. నిబంధనలను పాటించని వాహనదారులకు జాగ్రత్తలు సూచించారు. కొందరికి జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా ప్రజలకు భద్రత కల్పించేందుకు ఇటువంటి వాహన తనిఖీలు రెగ్యులర్‌గా నిర్వహిస్తామని ఎస్ఐ రామారావు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా తమ్మునాయుడు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన కర్రి తమ్మునాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక మండల నేతలు, కార్యకర్తలు తమ్మునాయుడుకు శుభాభినందనలు తెలిపారు.

ఆచార్యులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్. ఆచార్యులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించింది. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆచార్యులకు పురస్కారాన్ని అందజేశారు. ఉపాధ్యాయవృత్తిలో అంకితభావంతో పనిచేసిన ఉభయ తెలుగు రాష్ట్రాలలోని బ్రాహ్మణ ఉపాధ్యాయులను గుర్తించి వారికి పురస్కారాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- చీడికాడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో కూటమి నాయకుల ఆర్థిక సహకారంతో గల్లీ బాయ్స్ క్లవర్ బాయ్స్, గ్రామ యువత ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఏటా దిబ్బపాలెంలో వినాయక చవితి ఉత్సవాలను వేడుకగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది కూటమి నేతల ఆర్థికసాయంతో అన్నసమారాధన, ఇతర కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

'తప్పుడు ఆరోపణలు మానండి'

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని పెద్దార్కూర్ పంచాయితీ రేపాకలో పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మడకం బొజ్జి, మడకం రత్తయ్య ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపాక, భగవాన్‌పురం గ్రామాల మధ్యలో వాగు ఉందని అందులో నీళ్లను రెండు గ్రామాల ప్రజలు వ్యవసాయం కోసం వాడుకుంటున్నారని తెలిపారు. కాని గత ఏడాది గ్రామానికి చెందిన గిరిజన రైతుల్లో ఒక రైతు విద్యుత్ మోటర్ వేసి నీళ్లు తోడడం వలన కింద రైతులకు నీళ్లు అందక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పెంటా రాము మోటారు వేయకుండా చర్యలు తీసుకున్నామని పీసా కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు తెలిపారు.. కాని కొంతకాలం క్రితం బాబు బొర్రయ్య అనే వ్యక్తి మోటార్లు వినియోగించవద్దని బెదిరించాడని లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. బాబు బొర్రయ్యకు ఏ విధమైన సంబంధం లేదని అన్నారు. తప్పుడు అభియోగం చేసిన వ్యక్తి నిరూపించుకోవాలని లేని పక్షంలో పీసా కమిటీ చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -జికెవీధి: మండలంలోని మొండి గెడ్డ పంచాయతీలో జడ్పీ నిధులతో 130 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. సర్పంచ్ ప్రియాంక, ఎంపిపి బోయిని కుమారి ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జర్త బాలన్న, గబులంగి సతీష్ కుమార్, గబులంగి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ముల్కనపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని ఆదివారం ముల్కనపల్లి పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ సవల మారయ్య మాట్లాడుతూ వర్షాలు కురవడంతో దోమలు విజృంభించకుండా బ్లీచింగ్ వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోల్తా పడిన కారు

అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

- కారులో గంజాయి చూసి అవాక్కయిన పోలీసులు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని చిన్నబీరంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనంలో గంజాయి చూసి అవాక్కయ్యారు. ప్రమాదానికి గురైన వాహనంలో గంజాయి బస్తాలు ఉండడంతో అప్రమత్తమైన పోలీసులు గంజాయిని ఆటోలో రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ ఘటనలో నిందితులు పరారీలో ఉన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 165 కిలోల వరకూ ఉంటుందని అంచనా వేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సింది.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని జడ్డంగి ఎస్ఐ చినబాబు అన్నారు. ఆదివారం లోదొడ్డి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై సామాజిక సమస్యలు, చట్టవిరుద్ధ చర్యలపై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, వినియోగం వలన కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. బాల్యవివాహాలను నివారించడంలో గ్రామస్తులు సహకరిం చాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ నియ మాలు పాటించాలన్నారు. ఇటీవల పెరుగుతున్న ఉద్యోగ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత డ్రగ్స్ మత్తులో పడి జీవితాలు నాశనం చేసుకోకూడదన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

బీరకాయలు కారుచౌక

సంతలో విక్రయిస్తున్న బీరకాయలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో ఆదివారం వారపు సంతలో బీరకాయలు కారుచౌకగా లభించడంతో వినియోగదారులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. దుప్పిలివాడ పంచాయతీ పరిధి కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, జొన్నమామిడి తదితర మారుమూల గిరిజన గ్రామాల్లో రైతులు కూరగాయలు అధికంగా సాగు చేస్తున్నారు. మరి కొంతమంది గిరిజనులు చింతపల్లి సమీపంలో ఉన్న చౌడుపల్లి నుంచి కూరగాయలు కొనుగోలు చేసి వారపు సంతల్లో విక్రయాలు జరుపుతున్నారు. నెలరోజుల కిందట కిలో 60 నుంచి 80 రూపాయలకు బీరకాయలు విక్రయించేవారు. ఆదివారం వారపు సంతలో కిలో 20 నుంచి 30 రూపాయలకి విక్రయించారు. అదేవిధంగా బెండకాయలు కిలో 40, టమాట30, దొండకాయలు 40కి విక్రయించారు. కూరగాయలధరలు ఇప్పుడిప్పుడే అందుబాటులోకి రావడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముహూర్తపు రాట వేస్తున్న మహిళలు

శరన్నవరాత్రులకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి-విఆర్‌పురం: దేవిశరన్నవరాత్రులకు మండలంలోని శ్రీరామగిరిలో సుందర సీతారామచంద్ర స్వామి దేవస్థానం కళ్యాణ మండపం వద్ద ఆలయ అర్చకులు సావిత్రి పురుషోత్తమాచార్యులు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామస్తులు ఆదివారం ముహూర్తపు రాట వేశారు. నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుర్గరావు గుండెపూడి లక్ష్మణ రావు కాంతారావు, గొమ్ము సత్యనారాయణ, చంద్రరావు, ధర్మ ప్రచారక్ శ్రీరామ కష్ణయ్య గ్రామప్రజలు పాల్గొన్నారు.

కాకునూరి కృష్ణార్జునరావుకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-కూనవరం: విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో తెలుగు సంస్కృతి సాహితీ సేవాట్రస్ట్‌వారు జాతీయ సేవా పురస్కారాలు ప్రధాన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం, చూచిరేవుల గూడెం గ్రామానికి చెందిన కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరి కృష్ణార్జునరావు ఆయన భార్య దుర్గాభవానిని సన్మానించి మహానంది, జాతీయ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌చైర్మన్ మాచర్ల గౌరీశంకర్ మాట్లాడుతూ కాకునూరి కృష్ణార్జునరావు 13 సంవత్సరాల నుంచి తన సొంత డబ్బుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీవీ ఆర్టిస్టులు, జూనియర్ నాగార్జున, పల్సర్‌బైక్ రమణ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణార్జునరావు, ఆయన భార్య దుర్గాభవానిని సన్మానిస్తున్న దృశ్యం

11 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -కొయ్యూరు: ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 11 కిలోల గంజాయితో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేశామని కొయ్యూరు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో చీడిపాలెం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా మోటార్‌సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తున్నట్లు గుర్తించి తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి చేబ్రోలు గ్రామానికి చెందిన కర్రి పవన్‌కుమార్ తప్పించుకున్నాడు. మరో వ్యక్తి పైరుమల కోవెల జోగేంద్రను గంజాయితో పాటు బైక్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కిషోర్‌వర్మ తెలిపారు. కేసు నమోదు చేసి జోగేంద్రను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి

పంచాయతీ భవనానికి రూ.32 లక్షలు మంజూరు

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండలం చింతలపూడి పంచాయితి భవనం 32 లక్షలు మంజూరు చేసినట్టు జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతోందని ఆయన కొనియాడారు. దీనిలో భాగంగా ఆదివారం శంకుస్థాపన కార్యక్రమానికి జిసిసి మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి ఎంవివి ప్రసాద్ సర్పంచ్ సెగ్గే రమాదేవి, రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శి కొర్రు రామమూర్తి, పంచాయితి అధ్యక్షులు కొర్రు పుల్లయ్య, గ్రామకమిటీ అధ్యక్షులు బొంకుల గడ్డయ్య, యూనిట్ ఇన్‌చార్జి పోటుకురి సన్యాసిరావు, మాజీ ఎంపిటిసి కిలే బాలరాజు, ధూపం శ్రీను పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. జివిఎంసి సాధారణ పద్దుల్లో భాగంగా గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకూ సుమారు రూ. 420కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నాయని వాటిలో కనీసం ఆరు నెలల బకాయి బిల్లులైనా చెల్లించేలా చూడాలని కోరారు. ఇటీవల ఎపి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఎంఎస్‌ఎంఇ ద్వారా డిస్కౌంట్ బిల్లుల పేరిట చెల్లింపులు చేసేందుకు అవకాశం ఇచ్చిందని, ఆ విభాగ సిబ్బంది కూడా సహకరిస్తామని చెప్పిన విషయాన్ని కాంట్రాక్టర్లు గుర్తు చేశారు. ఆ ప్లాట్‌ఫారం ద్వారా బిల్లులు చెల్లించేందుకు ఇప్పటికే జివిఎంసి అదనపు కమిషనర్ తమ అనుమతి కోరారని, సమ్మతి తెలియజేశామని కాంట్రాక్టర్లు తెలియజేశారు. కనీసం 6 నెలల బిల్లు అయినా చెల్లించాలని లేనిపక్షంలో పనులు చేయడం కష్ట సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు వాపోయారు. కాంట్రాక్టర్స్ సంఘం అధ్యక్షులు పివివి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు ఒడిశా గృహిణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భర్తతో గొడవపడి విశాఖ వచ్చిన ఒడిశా యువతిని ఆమె తల్లికి అప్పగించినట్టు ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ సమీపంలోని తాయాపుట్ గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి రోస్ మెర్రీ కేత్రియా (23)కు పెళ్లి అయ్యి ఏడాది అవుతోంది. ఇంతలో భర్తతో గొడవ పడి ఇంట్లో చెప్పకుండా రైలు ఎక్కి నేరుగా విశాఖపట్నం వచ్చేసింది.ఈమెను రైల్వేస్టేషన్‌లో జిఆర్పి కానిస్టేబుల్ నారాయణరావు చూసి మహిళా కానిస్టేబుల్ పూజితతో కలసి జివియంసి టిఎస్‌ఆర్ కాంప్లెక్స్ మహిళా వసతిగృహానికి తీసుకువచ్చి వసతి కల్పించారు. తన దగ్గర ఉన్న మొబైల్ నెంబర్‌తో వాళ్ల అమ్మకు విషయం తెలిపారు. తల్లి మగదలిన్ కేత్రియా హుటాహుటిన షెల్టర్‌హోంకు ఆదివారం వచ్చారు. క్షేమంగా కూతురిని అప్పగించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బిసి అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా ఓల్డ్‌టౌన్ పాతపోస్టాఫీసు ఏరియాలోని ప్రభుత్వ బిసి బాలికల కళాశాల సంక్షేమ వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. వసతిగృహాల్లో సౌకర్యాలు, చదువు ఇతర పరిస్థితులపై ఆరా తీశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్స్, మెస్‌ఛార్జీల గురించి విద్యార్థినులు చెప్పిన అంశాలను శ్రద్ధగా విన్నారు. వసతిగృహంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి, బిసి వెల్ఫేర్ ఇన్చార్జి అధికారి కె.రామారావు, బిసి నాయకులు పితానిప్రసాద్, డాక్టర్ జగదీష్, పరిపూర్ణచారి, వసతిగృహ అధికారులు జ్యోతి, శివ పాల్గొన్నారు.

ఏడేళ్లకే 7 కిలోమీటర్లు ట్రెక్కింగ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మనిషి తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలడు. ఈ మాటలను విశాఖ జిల్లా చెందిన ఏడేళ్ల బాలిక ఆధ్య నిజం చేసి చూపించింది. ప్రస్తుతం విశాఖ వ్యాలీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఎరుబండి ఆధ్య తన తండ్రి ఎరుబండి భరత్‌తో కలిసి కంబాలకొండపై ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి అందరితో భళా అనిపించు కుంది. కంబాల కొండపై ట్రెక్కింగ్ చెయ్యడం చాలా కఠినమైనా ఆధ్య సులభంగానే పూర్తి చేసింది. దీంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.